క్లుప్తంగా

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా అనిల్



తలకొండపల్లి: బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా తలకొండపల్లికి చెందిన అనిల్ నియమితులయ్యారు. మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్‌కు వరుసగా రెండో ఏడాది ఈ పదవి దక్కింది. యాదీశ్ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అనిల్ పనితీరు మెచ్చి ఆయనను రెండోసారి ఈ పదవికి ఎంపిక చేసినట్లు చెప్పారు. అనిల్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టిన బీజేపీ నేత తల్లోజు ఆచారికి, జిల్లా అధ్యక్షుడు యాదీశ్‌కు, టీబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం సభ్యుడు, తారామతిపేట గ్రామానికి చెందిన కొమురయ్య మార్చి 29న మృతిచెందాడు. ఈ క్రమంలో సహకార సంఘం తరఫున సంఘం సభ్యుడి కుటుంబానికి అందించే రూ.25వేల నగదును సంఘం చైర్మన్ భరత్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం మృతుడి భార్య కవితకు అందజేశారు. సంఘం అకౌంటెంట్ రాకేశ్, నాయకులు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌పీకు ఆత్మీయ విరాళం



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విరాళం అందిస్తున్న సభ్యులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ నామినేషన్ ఫీజు కోసం ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ ఆధ్వర్యంలో క్రౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన రూ.17,500ను ఆత్మీయ విరాళంగా అందించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో.. ప్రవీణ్‌కుమార్ నామినేషన్ ఫీజు కోసం క్రౌడ్ ఫండింగ్ ద్వారా కార్యకర్తల నుంచి ఒక్కో రూపాయి చొప్పున ఆత్మీయ విరాళం సేకరించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు ఈమొత్తాన్ని ఆయన మద్దతుదారులు అందించారు. ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ సభ్యులు గోవింద్ శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు లాలయ్యగౌడ్, సుభాష్, రఘు, రమేశ్, శివకుమార్, ప్రసాద్, రమేశ్, ప్రవీన్, శంకర్, మహేశ్, వరుణ్, రోహిత్, కిరణ్, సిద్దు, రాజు, జగన్ పాల్గొన్నారు.

సీసీరోడ్ల సామాజిక తనిఖీ

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్, దేవుని పడకల్, అంతారం, పెద్దూర్ తండా, జంగారెడ్డిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఇటీవల వేసిన సీసీ రోడ్లను శుక్రవారం ఎస్‌ఎస్‌ఏటీ అధికారి కాశన్న, పీఆర్‌ఏఇ విద్యాసాగర్‌తో కలిసి సామాజిక తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా ఇసుక, సిమెంట్, కాంక్రీట్‌ను వాడారా అని పరిశీలించారు. రోడ్ల పొడవు, వెడల్పు, మందంను టేప్‌తో కొలతలు వేసి చెక్ చేశారు. ఆయన వెంట సామాజిక తనిఖీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా ఎయిర్‌పోర్ట్ రోడ్డు

పహాడీషరీఫ్: మామిడిపల్లి వివేకానంద చౌరస్తా నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు వేసిన నూతన రహదరి ప్రమాదాలకు నెలవుగా మారింది. ముఖ్యంగా మూల మలుపు వద్ద పూర్తి స్థాయిలో జిబ్రా క్రాసింగ్‌లు వేయకపోవడం, ప్రమాదం జరిగే ప్రాంతం అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల పరంపర కొనసాగుతుంది. ఈ చౌరస్తా సమీపంలోని 150 మీటర్ల దూరంలో మొదటి యూటర్న్ వద్ద మూల మలుపులో ఒకే తరహాలో జరిగిన రెండు ప్రమాదాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. శంషాబాద్ వైపు నుంచి నెల రోజుల క్రితం మిట్ట మధ్యాహ్నం ఎర్టిగా కారు ఇదే మూల మలుపు వద్దకు రాగానే అదుపు తప్పింది. రోడ్డుకు ఎడమ వైపు 15 మీటర్ల మేర దూసుకెళ్లి ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తాజాగా గురువారం అర్ధరాత్రి గతంలో మాదిరిగానే శంషాబాద్ నుంచి వేగంగా వచ్చిన డస్టర్ కారు అదే ప్రాంతంలో అదుపుతప్పి నేరుగా వెళ్లి అదే ప్రహరీని ఢీకొని ఓపెన్ స్థలంలోకి దూసుకెళ్లి అప్పటి కారుపై పడింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఒక కారుపై మరో కారు పడి ఉండడాన్ని చూసిన వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో వెంటనే 'గోస్లో' బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న జిబ్రా క్రాసింగ్‌కు కొద్ది వెనుకాల ఒక ట్రెండు క్రాసింగ్‌లు వేస్తే ప్రమాదాలను నివారించేందుకు వీలుంటుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

మార్కెట్‌కు మామిడి కళ

- బాటసింగారం పండ్ల మార్కెట్‌కు జోరందుకున్న లోడ్లు
- గతేడాది కంటే మెరుగైన ధరకు క్రయవిక్రయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన మార్కెట్ సిబ్బంది



బాటసింగారంలోని మార్కెట్‌లో మామిడి రాశులు

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ గడ్డిఅన్నారం బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడి కళ వచ్చింది. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్లో మామిడి లోడ్లతో పాటు విక్రయాలు జోరందుకున్నాయి. మార్కెట్‌యార్డులో మామిడి క్రయవిక్రయాలతో కొన్నిరోజులుగా సందడి నెలకొంది. గతేడాది మామిడి సీజన్లో బాటసింగారంలోని పండ్ల మార్కెట్లో దాదాపు రూ.239 కోట్ల మేర వ్యాపారం జరిగిన విషయం తెలిసిందే. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో మామిడి క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రైతులు, వ్యాపారులకు కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్యూకట్టిన వాహనాలు..

కొన్నిరోజులుగా వస్తున్న లోడ్లతో మార్కెట్‌లో మామిడి రాశులు నిండిపోయాయి. తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, ట్రాలీలు పండ్ల మార్కెట్ వద్ద క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు సుమారు 20వేల మెట్రిక్ టన్నుల మామిడి దిగుమతి కాగా, గతేడాది ఇదే సమయానికి 35,000 మెట్రిక్ టన్నులు విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాణ్యతను బట్టి టన్నుకు సగటున రూ.38వేల ధర పలుకుతోంది. ఈ సంవత్సరం మామిడి సీజన్ ముగిసే సరికి సుమారు లక్ష మెట్రిక్ టన్నుల మామిడి.. మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ధర కొంచెం ఎక్కువగా ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

మార్కెట్‌కు వచ్చే మామిడి క్రయవిక్రయాలు సాఫీగా కొనసాగడంతో పాటు ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా ఏర్పాట్లు చేశాం. మామిడి క్రయవిక్రయాలకు ప్రత్యేకంగా 12 ఎకరాల ప్రాంగణంలో భారీ షెడ్లు, మరో 7 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశాం. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించడంతో పాటు రైతులు, వ్యాపారులు దప్పిక తీర్చుకునేందుకు తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశాం. మామిడి బిడ్డింగ్, ఇతర నిర్వహణకు అవసరమైన నిబ్బందిని అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నాం. రైతులకు, వ్యాపారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. – నర్సింహారెడ్డి, బాటసింగారం మార్కెట్ కమిటీ సెక్రటరీ

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాయమాటలతో అధికారంలోకి వచ్చారు
- లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుస్తాం
- బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. వచ్చేనెలలో జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఇది తేటతెల్లం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఏఎస్‌ఎస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో జైపాల్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి... గడువు ముగిసిన వాటిని అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికే చాలామందికి రైతుబంధు సాయం అందలేదని, గ్యారెంటీలలో సగం కూడా అమలు కావడం లేదని ఆరోపించారు. అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి మొదలైందని.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పట్టం కట్టడం ఖాయమన్నారు. కాగా ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని.. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కేటీఆర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, ఎంపీటీసీ కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి



అదనపు తరగతుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కిషన్‌రెడ్డి

మాడ్గుల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కొల్కులపల్లి ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి కోరారు. మాడ్గుల మండలం కొల్కులపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ సహాయంతో రూ.20 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతిగదుల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి గ్రామస్తులు, ఎన్‌ఆర్‌ఐలు సాయం అందించాలని ఆయన కోరారు. వందేమాతరం ఫౌండేషన్ పాఠశాల తరగతిగదులు నిర్మించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, దానయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల్‌నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బూర'ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

బీజేపీ నేత వెంటేశ్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్‌ను వీడి ఆ పార్టీలో చేరినట్లు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్‌తో కలిసి శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో వెంకటేష్ గౌడ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉద్యమకారులకు, బీసీలకు సరైన గుర్తింపు లేదన్నారు. అందుకే ఆ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేకనే బీజేపీలో చేరినట్లు తెలిపారు. లోక్‌సభ భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు వెంకటేష్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్ధన్‌గౌడ్, రమాదేవి, సురేఖ, పాపయ్యగౌడ్, వీరస్వామి, ఎంపీ యాదగిరి, రమేష్, రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

ఎమ్మార్పీఎస్ నేత శ్రీకాంత్

యాచారం: ఎస్సీ వర్గీకరణను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఎంపీ ఎన్నికల ఎమ్మార్పీఎస్ మండల ప్రచార కమిటీ కన్వీనర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న బీజేపీకి చెందిన ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ కన్వీనర్‌గా శ్రీకాంత్, కోకన్వీనర్లుగా సలీం, ఆనంద్, మహేష్, జంగయ్య, అజయ్ తదితరులను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాండు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి



వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి, చిన్నారులు

కడ్తాల్: మూడు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ (స్కూల్‌డే)ను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో పాటు, వారి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు ప్రణాళిక ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల యొక్క స్థితిని బట్టి, వారికి సంవత్సరంలో మూడుసార్లు అభివృద్ధి సూచికలు, శారీరక, మానసిక వ్యక్తిగత భావోద్వేగ మేధావికాసం, బడికి సంసిద్ధత అంచనా వేస్తున్నారన్నారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంతో పాటు క్రీడలు, క్విజ్ పోటీలు వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు యాదమ్మ, సిబ్బంది, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

రుక్మిణీమాధవుల కల్యాణం



కల్యాణ వేడుకలోని ఓ ఘట్టం



ఆధ్యాత్మిక సందేశం ఇస్తున్న స్వామీజీ

కడ్తాల్: మండల పరిధిలోని బాలాజీనగర్ ధనరాశి గుట్టపై వెలసిన శ్రీ రాధాకృష్ణ స్వామి ఆలయంలో శ్రీ రుక్మిణీ మాధవుల కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ అహోబిల జీయర్ స్వామి పర్యవేక్షణలో వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామవత్ బీచ్యానాయక్, జనక్‌పూర్ నేపాల్‌కు చెందిన శ్రీబాబాస్ భగవాన్ మహరాజ్, రామేశ్వర్ మహరాజ్, ఆచార్య చెన్నప్ప, భగవద్గీత ప్రచారకులు శ్రీనివాస్, వికాస తరంగిణి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జాతీయ బంజారా మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణనాయక్, డాక్టర్ రాంచందర్‌నాయక్, రాజారాం గురుస్వామి, మాజీ సర్పంచ్ కష్లీ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం



పోల్కంపల్లిలో నేలరాలిన మామిడి కాయలు

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. యాచారం, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్త మేడిపల్లి, మాల్ తదితర గ్రామాల్లో అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో వర్షం కురియడంతో ప్రజలకు ఉపశమనం కలిగినట్లు అయింది.



కొంగరకలాన్‌లో పిడుగుపాటుతో కాలిపోతున్న తాటిచెట్టు

మూడుచోట్ల పిడుగుబాటు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారం బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కొంగరకలాన్‌లో రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. ఓ ఫాంహౌజ్ రోడ్డు పక్కన ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడటంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగుపాటుకు చెట్టు పూర్తిగా కాలిపోయింది. మరోచోట తాటిచెట్టుపై పిడిగు పడింది. అయితే ఎక్కడ కూడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రెండోరోజు ఐదు నామినేషన్లు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్, చిత్రంలో రాఘవులు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి బూర

సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా భువనగిరి స్థానానికి రెండో రోజు శుక్రవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్, బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్, సోషలిస్ట్ పార్టీ (ఇండియా) అభ్యర్థిగా రచ్చ సుభద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా మెగావత్ చందునాయక్, రేకల సైదులు ఒక్కోసెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. మొదటి, రెండో రోజు కలిపి మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లు వేశారు.

అట్టహాసంగా సీపీఎం అభ్యర్థి నామినేషన్

సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్‌కు ముందు భువనగిరి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జహంగీర్ వెంట సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండమడుగు నర్సింహ ఉన్నారు. నామినేషన్ అనంతరం బహిరంగ సభ నిర్వహించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఇన్‌స్పెక్టర్ భూపతి
- షాహిన్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్

పహాడీషరీఫ్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని బాలాపూర్ పోలీసులు షాహిన్‌నగర్ పరిసరాల్లో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి నేతృత్వంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఎర్రకుంట, సాదత్‌నగర్, షాహిన్‌నగర్, అల్లైస్ కాలనీ, వెంకటాపూర్‌ల మీదుగా ఈ కవాత్ కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పామన్నారు. పోలింగ్ రోజు ప్రతీ ఓటర్ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రౌడీయిజం, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేవారిని ఉక్కుపాదంతో అణచి వేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి అనకూలంగా నడుచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించేవారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్‌ఐలు మహేందర్, సైదులు, జానీ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

- అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు
- ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో మాక్‌డ్రిల్

ఇబ్రహీంపట్నంరూరల్: అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఇబ్రహీంపట్నం అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వం పాఠశాలలో శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాక్‌డ్రిల్ నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలితే, విద్యుదాఘాతంతో మంటలు చెలరేగితే ఎలా ఆర్పాలో అవగాహన కల్పించారు.అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్, జీహెచ్‌ఎం భారతి, ఫైర్ స్టేషన్ సిబ్బంది ఖాదిర్, నర్సింహ, శేఖర్, ఉపాధ్యాయులు జంగయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పహాడీషరీఫ్: బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మామిడిపల్లికి చెందిన విశ్వనాథ్ గౌడ్ నియమితులయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి యాదీష్ శుక్రవారం విశ్వనాథ్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ రోజు రోజుకు బలోపేతమవుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. తనకు పదవి అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో నీటి సౌకర్యం నిల్

రోగులు, సహాయకుల అవస్థలు

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సాధారణ అవసరాలకు సరిపడా నీటి సౌకర్యం లేక రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో ఉన్న బోరు ఎండిపోయి సంవత్సరాలు గడుస్తున్నా జలమండలి నుంచి ఎలాంటి నల్లా కనెక్షన్ లేకపోవడంతో చాలా కాలంగా బయటినుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. రోజు 5 నుంచి 6 ట్యాంకర్ల నీటిని తెప్పిస్తున్నామని సిబ్బంది చెపుతున్నా ప్రజల తాకిడికి తగ్గట్లుగా నీరు సరిపోవడం లేదు. టాయిలెట్లలో నల్లాల నుంచి నీరు రాకపోవడంతో రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆసుపత్రి ప్రాంగణంలో బోర్లు వేయించడం లేదా.. జలమండలి నుంచి నల్లా కనెక్షన్లు తీసుకోవడం లేదా.. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ట్యాంకర్లతో నీటిని తెప్పించడం చేయాలని స్థానికులు కోరుతున్నారు.